# ఎందుకో? ఎందుకో?



-చంద్రమౌళి

కిటికీలోంచి అలలాగా సూర్య కిరణాలు లోపలికి వస్తున్నాయి. సుజాత బాధగా మూలిగి అతి కష్టంమీద ఒక పక్కకు ఒత్తిగిలింది. అప్పుడప్పుడే ఆస్పత్రిలో అస్పష్టంగా మాటలు గాలిలో తేలిపోతున్నాయి. దేవకన్యల్లా నర్సులా అటూ ఇటూ తిరుగుతున్నారు; డ్యూటీలు మారుతున్నారు. సుజాతకు ఏదీ చూడ బుద్ధి కావటం లేదు. పెద్ద అట్టహాసం చేసి పైదాకా వెళ్ళలేక క్రిందకు కూలిన రాకెట్‌లా ఆమె మనసు స్తబ్ధంగా ఉంది. తెరిచి ఉన్న కిటికీ లోంచి ఒక రివట చల్లటి గాలి విరోధి సైన్యంలా లోపలికి చొచ్చుకుని వచ్చి మెల్లిగా గదిని ఆక్రమించసాగింది. సుజాత అతి కష్టం మీద ఆలోచనలకు ఒక రూపం కలుగకుండా చేస్తున్నది. కళ్ళు మూసుకున్నది, ఎదురుగుండా ఉన్న దృశ్యాన్ని గురించి ఆలోచించ నవసరం లేకుండా. గడిచిపోయిన నిన్న ఆమెను భయపెట్టాలని వ్యర్థ ప్రయత్నం చేయసాగింది.

నర్సు కాబోలు మెత్తటి కాన్వాసు షూజు కావాలనే దబదబ లాడిస్తూ నడుస్తున్నది.

"లే అమ్మా! లే, మందు తాగుదువు."

సుజాతకు మందు తాగాలని లేదు. అలాగే గట్టిగా కళ్ళుమూసుకుని పడుకున్నది. నర్సు వదిలేలా లేదు. ఆమె మీద కప్పిన దుప్పటి పక్కకు తొలగించి, మెల్లగా మందు గ్లాసు పెదవులకు అనించింది.

"వద్దు!" అన్నది సుజాత.

"ఏం? చచ్చిపోదా మనుకుంటున్నావా? చచ్చి ఎవరిని సాధిస్తావు? చావటం అంత తేలికనుకున్నావా? లే— లే" అంటున్నది నర్సు.

అవును. తను చచ్చిపోవాలి! తను ఎవరికోసం బతకాలి? ఎందుకు బతకాలి? తనకీ జీవితం మీద విరక్తి కలిగింది. తను చచ్చిపోవాలి.

"చచ్చిపోదలుచుకుంటే చాలా జీవిత ముంది. లే, ముందు లే. దబ్బున మందు తాగు. డాక్టరు వచ్చే వేళ అయింది. ఆయన పుణ్యమా అని మళ్ళీ బతికి బట్టకట్టావు!" నర్సు తన ధోరణిలో తను చెప్పుకు పోతున్నది.

"నన్ను చచ్చిపోనివ్వవలసింది. ఎందుకు బతికించారు నన్ను?" సుజాత అన్నది, చిరుకోపంగా.

"ఇంకా నయం! ఎందుకు చంపారు కాదు? అని లేదు. ఆత్మహత్య చేసుకోవటం క్రైమ్. తెలుసా?" అన్నది నర్సు.

సుజాత మాట్లాడలేదు.

ఫ్లోర్ తుడుస్తున్నారల్లే ఉంది, ఫినాయిల్ వాసన గాలిలో తేలి వస్తున్నది. బూట్లు టకటక చప్పుడు. డాక్టరు వస్తున్న ట్లున్నాడు. గట్టిగా కళ్ళు మూసు కుంది సుజాత. ఆమెకు ఎవరినీ చూడాలని లేదు. ఎవరితోటీ మాట్లాడాలని లేదు.

"భగవాన్! నన్నెందుకు బ్రతికించావు? నా కెందు కీ నరక యాతన కలిగిస్తున్నావు?" ఆమె ముఖం బాధతో ముకుళించుకు పోయింది. నుదుటి మీద గీతలు పడినాయి.

"పేషెంట్‌కి మందిచ్చావా, సిస్టర్?" డాక్టరు అడుగుతున్నాడు.

"తాగనని మారాం చేస్తున్నది, డాక్టర్!"

"చూడమ్మా! జీవిత మన్న తరవాత ఎన్నో బాధలూ, కష్టాలూ ఉంటాయి. మే మందరమూ బాధలు లేకుండా బ్రతుకుతున్నామా? మరి, ఆత్మ హత్య ఒక్కటే మార్గమా! చదువుకున్నదానివి నీకు నేను చెప్పే దేముంది? చావాలనుకున్నా అది మన చేతుల్లో ఉందా? లేదు! మందు తాగకపోతే శారీరక బాధ పెరుగుతుంది. అది సొల్యూషన్ కాదు కదా? ఆ పక్కకు ఒత్తిగిలు. బాధ పోవటానికి ఇంజెక్షన్ ఇస్తాను." నర్సు మెల్లిగా పక్కకు జరి పింది సుజాతను. క్షణంలో డాక్టరు ఇంజెక్షన్ ఇచ్చేశాడు.

"జీవితంలో మజా జీవించటంలోనే ఉంది. చచ్చి పోవటంలో లేదు. కొద్ది సేపట్లో పోలీసులు వస్తారు. అన్నట్లు — మీ వాళ్ళెవరూ రాలేదా? స్టేట్ మెంట్ ఇచ్చేటప్పుడు కాస్త ఆలోచించుకుని చెప్పండి. ఆత్మహత్య నేరమని మీకు తెలుసుననుకుంటాను."

సుజాత మనసులో ఎన్నో ఆలోచనలు రేగు తున్నాయి. 'భగవాన్! నన్నెందుకు బ్రతికించావు?' ఆమె కనుకొలకుల్లో ముత్యాల్లా నీటి బొట్లు గూడుకట్టు కున్నాయి.

"డాక్టర్! నే నిప్పుడేమీ చెప్పే పరిస్థితిలో లేను. ఎవరితోనూ మాట్లాడే స్థితిలో లేను!" ఆమె గొంతు నీరసంగా ఉంది. మాట జీరబోయింది.

"ఆల్‌రైట్! ఆల్‌రైట్! కాని, ఆలోచించుకోండి ఏమి స్టేట్‌మెంట్ ఇస్తారో?"

డాక్టర్ బూట్లు టక టక లాడించుకుంటూ వెళ్ళిపోయాడు.

సుజాత కళ్ళు మూసుకుని నిద్రపోవాలని ప్రయత్నం చేస్తున్నది. ఒళ్ళంతా కట్లు. జీవితంలో ఎప్పుడూ ఆస్పత్రికి రాలేదు సుజాత. ఎప్పుడూ చిన్నదైనా ఎరగదు. తన జీవితం ఎలా మారిపోయింది. ఇప్పుడు బాండేజి విప్పాక ఒంటినిండా ఎన్ని మచ్చలు మిగిలిపోతాయో!

'భగవాన్! నా కెందు కీ శిక్ష వేశావు? నే నంటే నీకూ కోపమా! నీ దగ్గరికి ఎందుకు రానివ్వలేదు? ఈ మచ్చలతో, ఈ అంద వికారమైన శరీరంతో ఎలా బ్రతికేది? నేను చచ్చిపోతే ఎంత బాగుం డేది! నేను నీ దగ్గరికి రావటం నీకూ ఇష్టంలేదా?"

తెల్లవారి వచ్చినట్లుంది. నర్సు వచ్చి సుజాతను లేపి కూర్చోబెట్టి పాలు పట్టింది. తాగాలనీ, తినాలనీ లేకపోయినా యాంత్రికంగా సుజాత లేచి కూర్చు



హైదరాబాదు లోని కూచిపూడి ఆర్ట్ అకాడమీ విద్యార్థులు, ప్రిన్సిపాల్ కుమారి శోభానాయుడు ఆధ్వర్యంలో కళాప్రపూర్ణ శ్రీ వెంపటి చినసత్యంగారిని సన్మానించి నప్పటి చిత్రం

న్నది. ఇప్పటికి డాక్టరు రెండుసార్లు అడిగారు— 'మీవాళ్ళెవరూ రాలేదేం?'— అని. ఎవరు వచ్చారు, ఎవరు రాలేదన్న విషయం మీద ఆమె మనసు నిలవటం లేదు. పోలీసులు వచ్చినప్పుడు తా నేమిటి చెప్పేది? ఏమని చెబుతుంది? చీకటిలో కలిసిపోయిన చిన్న ఆమె మనసులోంచి చెరిగిపోవటం లేదు. ప్రతి జీవితంలోనూ ఏదో ఒక రోజు అలా వస్తుంది కాబోలు! రాకపోనూవచ్చు. అయినా తన జీవితం లోకి వచ్చింది. ఆమెకు కడుపునిండా నిద్ర పోవాలని ఉంది. అయినా నిద్ర రావటం లేదు. రాత్రంతా బాధతో, ఆలోచనలతో నిద్ర పట్టలేదు. అయినా ఇప్పుడు నిద్ర రావటం లేదు. ఈ లోకాన్ని శాశ్వతంగా విడిచి పోవాలని ఉంది. కాని, మార్గం? అనేక మార్గాలు ఉన్నాయి తనకు శాశ్వతమైన విముక్తి లభించటానికి. కాని, ఇక్కడ ఈ ఆస్పత్రి అనే బందిఖానాలో ఇరుక్కుంది తను. పోనీ, నర్సు ద్వారా ప్రయత్నిస్తేనో? ఆమె తటపటాయించింది.

* * *

"అయ్యో! నా తల్లీ! ఇంత అఘాయిత్యాని కెందు కొడిగట్టావే? కాకితో కబురంపితే వచ్చివాలే దాన్ని కదా?" సుజాత తల్లి సుజాతను చూస్తూనే అన్నది. ఆమె కళ్ళ వెంబడి సంతతధారగా నీళ్ళు కార సాగినాయి. సుజాత తల్లివంక నిర్మమతతో చూస్తూ, ఉండిపోయింది.

"అన లిలా ఆత్మహత్య చేసుకోవలసిన కర్మేం వచ్చిందమ్మా! మేము చచ్చిపోయామనుకున్నావా? ఇరవై ఏళ్ళు పెంచి పోషించిన మా సంగతే నీకు జ్ఞాపకం లేదా? ఇన్నాళ్ళూ నా దగ్గర దాచని బాధ లేమొచ్చాయే నీకు—ఇలా అన్యాయానికి ఒడి గట్టావు?" ఆ తల్లి రోదనకు అడ్డు లేకుండా ఉంది.

"ఊరికే మనసు వికలమవుతుంది. మీ లాంటి పెద్దవాళ్ళు కూడా ..." నర్సు వచ్చి ఆమెను ఓదార్చ బోయింది.

"ఆ భగవంతుడు చల్లగా చూచి బయటపడింది. లేకపోతే — నేను జీవితాంతం కుమిలి కుమిలి చావ వలసిందేగా?" పమిట కొంగుతో తుడుచుకుంటూ ఆమె ఏడుస్తూనే ఉంది. సుజాత తండ్రి అల్లంత దూరాన కూర్చున్నాడు. అతని నోట మాటరావటం లేదు.

సుజాత మనసులో ఏ ఆలోచనా లేదు. తనను చావు చేతుల్లోంచి రక్షించి భగవంతుడు తనకు మేలు చేయలేదని తన మనసులో ఉన్న ఆలోచన తన తల్లి కెలా చెప్పేటట్లు? ఆమెకు చెప్పినా ఎలా అర్థమవుతుంది?

"అమ్మాయిని కాస్త విశ్రాంతి తీసుకోనియ్యి. మనం స్నానం చేసి వద్దాము" అన్నారు రాఘవయ్య గారు. ఇద్దరూ లేచి వెళుతూంటే తృప్తిగా శ్వాస పీల్చింది సుజాత. వాళ్ళేమేమి ప్రశ్నలు వేస్తారో, ఏం సమాధానం చెప్పాలో నని కలత పడిన మనసు కొక స్తిమితం లభించినట్లయింది. వాళ్ళు వెళ్ళిపోయాక ఏ క్షణాన అయినా పోలీసులు వస్తారనీ, తను వాళ్ళ కేం చెప్పాలోననీ మనసు ఉద్విగ్నమైంది.

తనకు పెళ్ళయి సంవత్సరంకూడా కాలేదు. కాపరానికి వచ్చి పది నెల లయిందేమో? ఆయన. ఇంజనీరు. ఒక ప్రయివేటు కంపెనీలో ఉద్యోగంక ఒక్కగానొక్క మగ సంతానం. పెద్దగా కలిమి లే పోయినా, తమ సంసారం సాఫీగా సాగటానికి సరిపడా సంపాదన ఉంది. అది చూసే తమ శక్తికి మించిన కట్నం ఇచ్చి పెళ్ళి చేశారు తన తలి దండ్రులు. తను చూచిందల్లా అందగాడూ, ఇంజనీరూ తన భర్త కాబోతున్నారని. అయితే, ఆయన తనను తను తెచ్చే కట్నం కోసమే చేసుకున్నాడని అప్పుడు తన కనిపించ లేదు. తననొక పురుగుగా చూచాడే కానీ, భార్యగా, జీవిత భాగస్వామినిగా, కనీసం ఒక వ్యక్తిగా నన్నా చూడలేదే? అయినా, తను సహించింది. కాలమే ఈ సమస్య కొక పరిష్కారం చూపుతుం దనుకున్నది. ఎక్కడికీ తీసుకు వెళ్ళేవాడు కాదు. ఎందరో కొత్తగా పెళ్ళయిన జంటలు రిక్షాల్లో, స్కూటర్లలో సినిమా లకు వెళుతూంటే వాళ్ళను ఇంటి వరాండాలోంచి చూస్తూ తీరని కోరికలతో, ఎగిసి పడే మనస్తాపంతో విలవిల్లాడి పోయేది తను. అయినా, పల్లెత్తు మాట తన వాళ్ళతో చెప్పిందా? 'నాకీ శిక్ష ఎందుకు విధించావు, దేవుడా!' అని చీకట్లో కళ్ళు ఒత్తుకుంది కాని! తన నిత్య జీవితం ఒక మరలా గడిచిపో సాగింది.

తను కాపురానికి వస్తూ అన్నీ తెచ్చుకుంది—డబుల్ కాట్స్, సోఫాసెట్, రేడియో, బోలెడంత సామాను. తనకు మట్టుకు ప్రేమలూ, అభిమానాలూ ఉండవా? తాళి కట్టినందుకు ఒక్క రోజు— కనీసం ఒక్క క్షణం ఆత్మీయంగా, ప్రేమగా, ముద్దుగా— గత జీవితంలో ఏం పాపం చేసిందో భర్త ఉండగా కన్నెరికం తీరని బతుకు వ్రాశాడు భగవంతుడు తనకు! ఎవరితో చెప్పుకునేటట్లు? ఏమని చెప్పుకునే టట్లు?

అతన్ని మురిపించాలనీ, అతన్ని తనవాడుగా చేసుకోవాలనీ ఎంతో ప్రయత్నం చేసింది తను. అయినా, ఫలితం శూన్యమే. తనకు మార్గమేమిటి? తన కర్తవ్య మేమిటి? రాను రానూ జీవితం దుర్భర మైంది. జీవించాలనే కాంక్ష లేకుండా పోయింది.

పైన ఫాను కిర్రు కిర్రు మని చప్పుడు చేస్తున్నది, గుండెకు లయగా. అచేతనంగా పడుకుంది సుజాత. నిన్న ఎలా తెల్లవారిందో, ఎలా గడిచిందో ఆమె జ్ఞాపకం చేసుకో దల్చుకోలేదు. సాధ్యమైనంత మటుకు ఆ ప్రస్తావన రాకుండా ఉంటే బాగుండును. కాని, తన తలి దండ్రులూ, డాక్టరూ, నర్సూ ఇంకా పోలీసులూ—రేపు తన గతి ఏమిటి? తనేం చేయాలి? తన జీవితానికి ఇది ఒక మలుపా? ఇన్నాళ్ళు తనకు నరకప్రాయమైన ఆ ఇంట్లో తనెలా జీవితం కొనసాగించగలదు? తను పుట్టింటికి వెళ్ళవచ్చు. కాని, దానివల్ల స్త్రీగా తన జీవితానికి పరిపూర్ణత లభిస్తుందా? తనకు కావలసినది రెండు పూటలా భోజనమూ, కట్టుకోవటానికి బట్టా మాత్రమే కాదు గదా?

తను కోర్టు చుట్టూ తిరగ గలుగుతుందా? కోర్టులో నిలబడి తన జీవితాన్ని బట్ట బయలు చేసుకుంటుందా? తన సాంసారిక జీవితపు తలుపు తెరిచి, ఈ సంఘాన్ని ఆహ్వానిస్తుందా? ఏమిటి చేయటం? అసలెందుకు ఏది కానీ చేయటం? 'భగవాన్! నన్నెందుకు పుట్టించావు? నన్నెందుకు చావు చేతుల్లోంచి బయట పడేశావు? ఇంతమంది జనాభాలో నేనొక్కదాన్ని తరుగైతే ఏం మునుచుకు వస్తుందని! ఎందుకు చేశా వీ పొరపాటు?"

మధ్యాహ్నం కావటంతో కాస్త సందడి తగ్గి పోయింది. రోగులు నిద్రకు జోగుతున్నారు. సుజాతకు మట్టుకు నిద్ర పట్టడం లేదు. ఇంత కాలమూ తనను బాధించింది ఒకే విషయం. తన కాపరం ఎలా చక్కబడుతుందా అనే. ఇప్పుడు ఇంకో ఆలోచన. ఎలా? ఎలా? పైన కిర్రు కిర్రుమని ఫాను తిరుగుతున్నది. మగతాగా ఉంది. కళ్ళు మూసుకున్నా నిద్ర రావటం లేదు. ఏదో ఇంకో ప్రపంచంలో ఉన్నట్లు, ఎక్కడికో తేలిపోతున్నట్టు భావన.

ఎవరివో అడుగుల చప్పుడు. ఆమె బలవంతాన కనురెప్పలు ఎత్తింది. ఎదురుగుండా ఏ వ్యక్తినైతే తాను చూడకూడదనుకుంటున్నదో అతను—ఆయన!

అతన్ని చూస్తూనే అవాక్కయి పోయింది ఆమె.

"ఎందు కొచ్చారు ఇక్కడికి? ఇంకా బతికి ఉన్నానా, లేదా అని చూడ్డానికి వచ్చారా? వెళ్ళండి. మీ ముఖం నాకు చూపించకండి". హిస్టీరియా వచ్చినట్లు అరిచింది సుజాత.

అతనేమీ మాట్లాడ లేదు. ఆమె కోపం తగ్గ టాని కన్నట్లు అలా ఆమె వంక చూస్తూ ఉండి పోయాడు. అతనెప్పుడూ ఆమె వంక అలా చూచినది లేదు.

"నాకు చావాలనే ఉంది! కాని, భగవంతుడు చావనీయలేదు. అయినా మీకు నేనే మవుతానని వచ్చా రిక్కడికి? ఇన్నాళ్ళుగా నే నక్కర లేనిది ఈ నాడు హఠాత్తుగా ఎందుకు కలిగింది నా మీద అభిమానం? పాపం! ప్రాణం మీద తీపి కలిగింది. కాబోలు! నేను చచ్చిపోయినట్లయితే ఆత్మహత్య చేసుకుందని కల్లి బొల్లి ఏడుపులు ఏడిచి ఒక అంద మయిన అమ్మాయిని చేసుకుని కులుకుదామని. నే నెరగనా మీ సంగతి?" ఆమె ఆవేశంతో మాటలు పెరుగుతున్నది.

అత నామె కళ్ళలోకి చూస్తూ అలాగే ఉండి పోయాడు. అతని పెదవులు కంపిస్తున్నాయి.

"మీ భార్యగా బతకటం కంటె చావటమే నయమని నాకూ తెలుసు. కాని, విధి వంచించింది. నన్ను, మిమ్మల్నీను."

దగ్గర ఉన్న స్టూలు లాక్కుని కూర్చున్నా డతను. అతని కాళ్ళు వణుకుతున్నాయి.

"కొద్ది సేపట్లో పోలీసులు వస్తారని చెప్పారు డాక్టర్, నా స్టేట్‌మెంట్ రికార్డ్ చేయటానికి. ఇది ఆత్మహత్య కాదనిచెప్పేస్తాను. అంతాచెప్పేస్తాను. నేను చచ్చినా మీకు సుఖం ఉండనివ్వను."

అతని కళ్ళు నీళ్ళతో నిండిపోయినాయి. అతను చొక్కాతో తుడుచుకున్నాడు.

చెప్పవలసినదంతా కక్కేసినట్లు ఆమె రొప్పుతూ ఉండిపోయింది.

అతనేదైనా అంటే బాగుండును.

అతను లేచి వచ్చి ఆమె పక్క మీద కూర్చున్నాడు అచేతనురాలైన బొమ్మలా ఆమె అతని వంక చూస్తున్నది. ఇంత దగ్గరగా అతని ముఖం. అతని బుగ్గల మీద కన్నీటి చారలు అలాగే ఉన్నాయి.

ఆమె అతని వంక చూస్తున్నది. అతను ఆమె వంక చూస్తున్నాడు. ఆమెకు ఎన్నో చెప్పాలని అతని మనసు ఉవ్విళ్ళూరుతున్నది. అయినా అతని నోట మాట పెగిలి రావటం లేదు.

బయట ఎవరివో అడుగుల చప్పుడు.

"కమాన్ మిస్టర్! యువర్ టైమ్ ఈజ్ అప్". ఆమె కళ్ళెత్తి చూచింది. ఎదురుగుండా పోలీసు ఇన్‌స్పెక్టర్. అతను మురడగా, ఇన్‌స్పెక్టర్ వెనకా! ఆమె అతను వెళ్ళిపోయిన వైపే చూస్తూ ఉంది. ఏదో చెప్పాలని ఆరాటం. ఇందాకా అంతగా పేలిన నోరు పెగల లేదు. అతను వెళ్ళిపోయాడు.

ఏమీ జరగనట్లు గోడ గడియారం ఐదు గంటలు కొట్టింది. రోగులను చూడడానికి వచ్చిన బంధువు లతో ఆస్పత్రి కల కల లాడుతున్నది. కాని, సుజాత మనసులో క్షణ క్షణం పెద్దది అవుతున్న పెద్ద క్వెశ్చన్ మార్క్? *

సూత్రయజ్ఞం
చిత్రం—శ. గోపాలరావు

